చిర్రుబుర్రులాడుతున్నాడు ప్రొడ్యూసరు. అతనిప్పుడు అర్జంటుగా ఒక డెయిలీ సీరియల్ తీయాలి. ప్రజాభిమానం పొందిన ఛానల్‌లో మంచి స్లాట్ కూడా దొరికింది. పలుకుబడి ఉపయోగించి అది సంపాదించాడు.

ఈ రోజున సీరియల్ తియ్యడం ఓ బ్రహ్మ విద్యా అనుకున్నాడు గానీ దిగేదాకా లోతు తెలియదన్నట్లు కథ దొరకడంలేదు.

దొరకలేదంటే దొరకలేదని కాదు. దొరుకుతున్నాయి కానీ అన్నీ అన్నీగానే ఉన్నాయి. ఇద్దరు రౌడీ ఆడవాళ్లు, వాళ్లవెంట ఒక్కొక్కరికీ అరడజను మంది వాళ్లు చేసే పాడుపన్లన్నింటికీ తాళంవేసే అసిస్టెంటు ఆడ కేరక్టర్లూ, దేభ్యం



# కొత్త దారి

మొహాలు వేసుకుచూడ్డం తప్ప నోటమాటరాని దజను మగ కేరెక్టర్లూ హీనపక్షం కావాలి ఈ కథలకు.

అంతమంది ఆర్టిస్టులని వెతకడం మాటలతో పనికాదు. ఇప్పటికే కాస్త ముక్కూ మొహం ఉన్నవాళ్లంతా చిన్నతెర మీదకి వచ్చేసి, ఒక్కొక్కరూ రెండేసి సీరియల్స్‌లో నటించేస్తున్నారు. అన్ని సీరియల్స్‌లోనూ అదే కథ, అవే మొహాలు.

కొత్త మొహాల కోసం తపించిపోతున్నారు జనాలు. కొత్తమొహాలు కదా అని యాభైఏళ్ల ఆవిడకు మొగుడుగా పాతికేళ్ల కుర్రాడిని వేసినా ఎబ్బెట్టుగానే ఉంటుంది. ఓ మోస్తరుగా అయినా పాత్రకు నప్పేవాళ్లు కావాలి.

ఈ ముఖ్య పాత్రలు కాకుండా పనివాళ్లు, పాలవాళ్లు, డ్రైవర్లు ఇలా చిన్నాచితకా పాత్రలు పోషించేవారు కావాలి.

సరేనయ్యా ఏదో కిందామీదా పడి మన భాష వాళ్లు దొరక్కపోతే పరభాషా వాళ్లనైనా వెతుక్కొస్తాం అనుకుంటే ఇక్కడ ఇంకా లిటిగేషనొచ్చింది మరి ఇంతా ఏర్పాట్లు చేసుకున్నాకా పది కాలాలపాటు కథ నడవాలా?

ఎంతమందిని అడిగినా అయిదొందల ఎపిసోడ్లు వరకూ నడిపించి చేతులెత్తేస్తున్నారు తప్ప ఓ పుష్కరం పాటు సీరియల్ నడిపించే సత్తా ఎవడిదగ్గరా కనిపించడంలేదు.

ఎవడిని పలకరించినా రీకేప్ వ్యవధి మరి కొంత పెంచితే బావుంటుందని, ఛమక్ ఛమక్ మనే క్లోజప్ షాట్లు మరికొంచెం పెంచితే బావుంటుందనీ చెత్త సలహాలు చెప్పేవాళ్లే గానీ పనికొచ్చే పాయింటు చెప్పే గట్టివాడు దొరకడంలేదు.

ముందు మొదలుపెడితే ఆనక కథ జీడిపాకంలా సాగదీయవచ్చుట. అదేమైనా కొత్త విషయమా? అన్నీ జీడిపాకం వ్యవహారాలే.

కొత్త సీసాలో పాత సారా లాగా ఆ సాగదీయడంలో కూడా ఏదైనా కొత్తదనం ఉండేలా చూడండి అని మొత్తుకుంటున్నా ఎవరికీ చాత కావడంలేదు.

ఆ మధ్య ఒక రచయిత వచ్చాడు. ఒక ఎపిసోడ్ రాసుకొచ్చాడు. హీరో హీరోయిన్లు మహాబలిపురం వెళ్తారు. హీరో అదివరకోసారి మహాబలిపురం చూసేసాడు. హీరోయిన్‌కి అదే మొదటిసారి.

బీచ్ దగ్గర నిలబడి 'డార్లింగ్ అదిగో ఆ కొండమీద... వేణుగోపాలుడి వెన్నముద్ద' అంటూ కొండమీదున్న పెద్దరాయిని చూపించాడు. 'ఇదుగో బంగాళాఖాతం' అని సముద్రాన్ని చూపించాడు. హీరోయిన్ ఆనందపడింది.

ఇద్దరూ పాత లైట్‌హౌస్ మీదకి ఎక్కారు. 'నా కలల రాణీ అదిగో వేణుగోపాలుడి వెన్న

**పొత్తూరి విజయలక్ష్మి**

ముద్ద, ఇదుగో బంగాళాఖాతం' అని చెప్పాడు.

ఆ తర్వాత ఇద్దరూ నడుచుకుంటూ కొబ్బరి బొండాలు తాగి వేరుశనక్కాయలు తింటూ అర్జునుడి తపస్సు శిల్పం దగ్గరకు వచ్చారు. "మై స్వీట్ హార్ట్... అదుగో లార్డ్ కృష్ణాస్ బటర్ బాల్, ఇదుగో బే ఆఫ్ బెంగాల్" అని ఈసారి ఇంగ్లీషులో చెప్పాడు.

తర్వాత ఇద్దరూ పాండవుల రథాల దగ్గరికి వెళ్లారు. హీరో "నా హృదయేశ్వరీ... అదిగో వేణుగోపాలుడి వెన్నముద్ద..."

వింటున్న ప్రొడ్యూసర్‌కి తిక్కరేగింది.

"చాలాపు... వెధవ సొదా నువ్వూను. ఎంత సీరియల్ అయితే మాత్రం మేక తోకకు మేక లాగా చెప్పిందే చెప్తావు నీకేమైనా మెంటలా? చెప్పింది చాల్లే దయచెయ్" అని ఆ రచయితని తరిమేసాడు.

అట్లా వచ్చేవాళ్లు వస్తున్నారు... పోతున్నారు...

వ్యవహారం మాత్రం కొలిక్కి రాలేదు. ప్రొడ్యూసర్‌కి బి.పి. పెరిగిపోతోంది. "మీరూరికే ఆలోచించి ఆరోగ్యం పాడుచేసుకోకండి. సమయానికి సీరియల్ మొదలు పెట్టేద్దాం. పెద్ద బంగళాలో పనివాడు దుమ్ము దులుపుతూ మొదటి ఎపిసోడ్, ఇంకో బంగళాలో తోటమాలి తోటకి నీళ్లు పెడుతూ రెండో ఎపిసోడ్ తీసేద్దాం. అలా ఓ పది ఎపిసోడ్స్ కథ లేకుండా లాగించేయవచ్చు.

ఆనక దొరికిన కథనిబట్టి ముందుకి నడపొచ్చు. లేదా అవసరమైతే ఫ్లాష్‌బ్యాక్‌కి వెళదాం అని ధైర్యం చెప్పాడు డైరెక్టర్.

అవన్నీ అపద్ధర్మ సూత్రాలు. శుభమా అని సీరియల్ మొదలెడుతూ మొదట్లోనే ఈ అడ్డదారులెందుకని నిర్మాత బాధ.

ఆవేళ ఒక రచయితని రమ్మని చెప్పారు. అతనికోసమే కాచుక్కూచున్నారు.

"ఏమిటో ప్రతివాడూ రావడం, ఏదో ఒక సోది చెప్పడం... వినీ వినీ విసుగేస్తోంది" అన్నాడు ప్రొడ్యూసర్.

"అలా విసుక్కుంటే ఎట్లా? అవసరం మనది. ఏ పుట్టలో ఏ పామున్నదో చూద్దాం!" ధైర్యం చెప్పాడు డైరెక్టర్.

చెప్పిన సమయానికే వచ్చాడు రచయిత రావు.

"ఏమయ్యా నీపేరు ఉత్త రావేనా?" అడిగాడు డైరెక్టర్.

"ముందు చాలా పెద్ద పేరే ఉందండీ. కొండవీటి చాంతాడంత పేరు ఎందుకని అవన్నీ పక్కనపెట్టి రావు అని సింపుల్‌గా పెట్టుకున్నా. అందరూ నన్ను రావు అనే అంటారు" అన్నాడు రావు.

"అదిసరే. మరి నీకేమైనా వచ్చా? రాదా?" నేరుగా అడిగాడు ప్రొడ్యూసర్.


"భలే జోకేసారు" అన్నాడు రావు.

"జోకులకేంలే... కథ చెప్పు" విసుక్కున్నాడు ప్రొడ్యూసర్.

"ఒక మధ్యవయసు ఆవిడ ఉంటుంది" మొదలెట్టాడు రావు.

"చూడబ్బాయ్... వ్యాపారం అంతా తనే నడిపే ఆడావిడ, ఇంట్లో కూర్చుని గడపదాటని ఆవిడ మొగుడు –

ఒక్కొక్కరికీ ఇద్దరు పెళ్లాలు... ఇలాంటి




పాత చింతకాయ కథలైతే వద్దు. ఏదైనా కొత్త దనం ఉంటే చెప్పు వింటాం. లేదూ నీదోవన నువ్వెళ్లు" అసహనంగా అడ్డుపడ్డాడు ప్రొడ్యూసర్.

గతుక్కుమన్నాడు రావు. "ఏమిటీ ఆదిలోనే హంసపాదు?" అనుకున్నాడు. అంతలోనే ధైర్యం తెచ్చుకున్నాడు.

"సరేనండీ! నేరుగా పాయింట్లోకి వస్తాను. నేనూ ప్రయోగం చేయాలనుకుంటున్నాను. అదేమిటంటే ప్రతిపాత్రకీ మూరెడు పొడుగు పేరు పెట్టడం" చెప్పాడు రావు.

"అదేమిటి పేరు పెద్దదైతే మాత్రం ఏం ప్రయోజనం?" అడిగారు శ్రోతలు.

"చాలా లాభాలున్నాయి. కథకి ప్రమేయం లేకుండా సీరియల్ నిడివి పెరుగుతుంది. పాత్రల సంఖ్య గణనీయంగా తగ్గుతుంది" చెప్పాడు రావు.

"గజిబిజిగా ఉంది. వివరంగా చెప్పండి" అడిగాడు ప్రొడ్యూసర్.

"ఉదాహరణకి హీరోయిన్ పేరు కమలిని. హీరో పేరు రాజేష్ అనుకుందాం. అపుడు సంభాషణ ఇలా ఉంటుంది. "కమలినీ నీ మనసులో ఏముందో చెప్తేకదా నాకు తెలిసేది!"

"రాజేష్, చెప్తేగానీ నా మనసులో ఏముందో నీకు తెలియకపోతే ఇక చెప్పి ఏం ప్రయోజనం చెప్పు?"

"అదికాదు కమలినీ... చెప్పకూడని విషయం ఎంత తప్పో, చెప్పవలసిన విషయం దాచడం అంతకు మించిన తప్పుకదా కమలినీ".

"రాజేష్...రాజేష్...నీకెలా చెప్పేది రాజేష్!"

"ఇలా జరుగుతుంది సంభాషణ కదా!" అన్నాడు రావు.

"అవునవును. అంతే. అలాగే సాగుతుంది"

అన్నారు శ్రోతలు.

"అదే హీరోయిన్ పేరు ప్రసన్నలక్ష్మి శివకామసుందరీ ప్రమద్వర. హీరో పేరు శ్రీకృష్ణ వాసుదేవ పురుషోత్తమ భరద్వాజ" అపుడేమవుతుందో చూడండి...

"ప్రసన్నలక్ష్మి శివకామసుందరీ ప్రమద్వరా! నీ మనసులో ఏముందో చెప్తేకదా నాకు తెలిసేది!"

"శ్రీకృష్ణ వాసుదేవ పురుషోత్తమ భరద్వాజా! చెప్తేగాని నా మనసులో ఏముందో..."

ఇలా సాగుతుంది. ఓ రెండు మాటలు మాట్లాడేసరికి ఏ సబ్బో... టూత్‌పేస్టో వచ్చి ఆదుకుంటుంది. మామూలుగా రెండు ఎపిసోడ్స్ మేటరు ఇలా పెద్ద పెద్ద పేర్లు పెడితే పన్నెండు ఎపిసోడ్స్‌కి సరిపోతుంది..." చెప్పాడు రావు.

"ఇదేదో బానే ఉందే! కేరెక్టర్ల సంఖ్య కూడా తగ్గుతుంది."

"బానే ఉంది గానీ అంతంత పేర్లుపెడితే అసహజంగా ఉండదూ?" సందేహం వెలిబుచ్చాడు ప్రొడ్యూసరు.

"ఆ... నా మొహం. ఇప్పుడు మాత్రం అంతా అసహజత్వమే కదా! వాస్తవానికి ఆపరేషన్ చేయాలంటే ఒంటిమీదున్నవన్నీ ఊడబీకి ఒక గౌను తొడిగి నెత్తిన టోపీ పెట్టి అపుడు తీసికెళ్తారు ఆపరేషన్ థియేటర్‌కి.

మరి మన సీరియల్స్‌లో అమిత ప్రమాదకరమైన ఆపరేషన్ చేసాకా థియేటర్‌లోంచి వచ్చిన పేషెంట్ పట్టుచీర, ఏడువారాల నగలు, పూలజెడా వేసుకుని స్ట్రెచర్‌మీద బయటికి వస్తూంటే ఇది అసహజం అని ఎవరైనా అన్నారా?

"చూడండి వీడు... స్కూల్లో ఎవరిదో పెన్సిల్ దొంగిలించుకొచ్చాడు..." కొడుకుపై భర్తకు ఫిర్యాదు చేసింది సుమతి.

"ఛ... తప్పు నాన్నా... అలా తేకూడదు. కావాలంటే నేను బోల్డన్ని పెన్సిళ్లు మా ఆఫీసు నుంచి తెచ్చిస్తానుగా..." హితబోధ చేసాడు తండ్రి.

కోట్లమీద వ్యాపారం అంటూ మాట్లాడే పాత్రలన్నీ పేవ్‌మెంట్ మీద దొరికే చీరెలు, షర్టులు, శాలువాలూ ధరించి ఫోజులు కొడుతుంటే ఇదేమిటని అడిగారా?

జనానికి కొత్తదనం కావాలి అంతే!" ధైర్యం చెప్పాడు డైరెక్టర్.

"సరే అయితే కథ మనం అనుకున్నదే ఉండనిద్దాం. పాత్రల పేర్లు మాత్రం ఈ రావుగార్ని రాసుకురమ్మందాం!" అన్నాడు ప్రొడ్యూసర్.

"అవును రావుగారూ...పన్లోపని మిగిలిన పాత్రల పేర్లు కూడా ఇదే పద్ధతిలో రాసుకురండి. మీ పెర్‌ఫార్మెన్స్ చూసి డైలాగ్స్ కూడా మీకే ఇస్తాం" అన్నాడు డైరెక్టర్.

రావు ఆనందంగా వెళ్లిపోయాడు.

"చూసారా... నే చెప్పలేదా? కృషితో నాస్తి దుర్భిక్షం. ఈ కొత్త విధానంతో మన సీరియల్ టెలికాస్ట్ కానివ్వండి. పదిమందీ ఇదే విధానం అనుసరించాలని చూస్తారు. ఎవరి పేరు ఏమిటో అర్థమయ్యేసరికి ఓ అయిదొందల ఎపిసోడ్స్ అయిపోతాయి."

"పోన్లెండి...ఈ ట్రెండు మనమే సృష్టించాం అనే తృప్తి వుంటుంది మనకు' అన్నాడు ప్రొడ్యూసర్ గర్వంగా. ●